# అనాధప్రేత సంస్కారం

"ఏంరోయ్ చైత్రం!"

"ఎందు కేమిట్రా వైశాఖం?"

"ప్రపంచం కంటిలో నల్లపూసవయ్యావేమోయ్!"

"యికనుంచీ హిమాలయం కాబోతున్నామోయ్."

"ఏమిటేమిటీ? కాస్తనాకో చెప్పగూడదురా!?"

"అందుకేగదోయ్. కాఫీకూడా పోకుండా యిల్లారావడమూ."

"భేషో భేషు!"

"మనం ఓ అఖండసన్మానం ఏర్పాటుచెయ్యబోతున్నామోయ్"

"దానికి నీవు అధ్యక్షుడుగావుంటే బాగుంటుందిరా."

"నీవు కార్యదర్శిగావుంటే భేషుగ్గావుండదురా!"

"మరి మన భోషాణంగాడ్రా"

"వాడు కోశాధిపతోయ్"

"ఏరా భోషాణం?"

"రైటో! రైటు"

" మనం యిప్పుడు ఏమిట్రా చెయ్యడం?"

"భోషాణంగాడు ఫొటోగ్రాఫీ నేర్చుకోవాలోయ్!"

"మరినేనా?"

"సన్మానపత్రంరాసేందుకు కవిత్వం నేర్చుకోవోయ్"

"ఏరా భోషాణం?!"

"నాకు యింతలో రాదురా బాబూ!"

"పదేళ్లలో రాకపోవటమేమిట్రా? అంతా విస్తారం."

"పదేళ్లదాకనట్రా? మన సన్మానసంతర్పణ."

"పదేళ్లకి మనకి ప్రత్యేక రాష్ట్రాలువస్తాయి."

"పదేళ్లకి మనవి చాలా జాతీయంపౌతాయి"

"పదేళ్లకి మనకి తిండికొరత తీరుతుంది"

"పదేళ్లకి మనదేశం భూతలస్వర్గంపౌతుంది"

"అన్నీ పదేళ్ళకేగదురా!"

"మరి అప్పుడేగదరా! మన అఖండసన్మానం"

"పదేళ్ళదాకా కార్యదర్శి ఏం తిని పని చేస్తాడురా"

"నిధులు వసూలుచెయ్యమటోయ్! నిధులు–"

"ఔనోయ్. మనం తక్షణం వసూళ్లుప్రారంభించాలి."

"వసూళ్ళకి కరపత్రాలు వేయించొద్దురా!"

"యింకెవడూ యీసంఘం పెట్టకుండా మనమే ముందు పత్రికల్లో ప్రకటించొద్దురా."

"పని ప్రారంభించేందుకు డబ్బుకావలిగదూ. యిటు తెండిరా నేను కార్యదర్శినీ!"

" నన్నడుగుతావేంరా ? భోషాణం వుండగానూ."

"అవునోయ్ ! వాడు కోశాధిపతిగదూ !"

"ఏరాభోషాణం. స్వల్పంగా పదిరూపాయలు ఇలా పడెయ్యరా."

"నేనేం పడెయ్యలేనురా బాబూ"

"ఆవున్నడబ్బంతా తగలేసుకుంటావా ఏంరా?"

"నాకుమాత్రం ప్లానుల్లేవట్రా."

"అదేమిట్రోయ్"

"పదేళ్లగ్గదురా అన్నీ జరిగేది"

"అంతేనోయ్. అంతే-"

"ఇవన్నీ అయ్యేదాకా ఆగలేనిజనం చస్తుండట్రా"

"................"

"వాళ్లకందరికీ గోరీలు కట్టించొద్దురా"

"ఛాన్సోయ్ లేకపోతే కుళ్లి గబులుగొట్టదూ!"

''ప్రభుత్వందగ్గర్నుంచి కాంట్రాక్టు తీసుకోబోతున్నానోయ్''

''ఛీ-ఛీ-వెధవపని''

''అదేమిట్రా! అనాథప్రేత సంస్కారం-కోటి యజ్ఞఫలం భవేత్' అనలేదురా పెద్దలు.''

''ఏఁరా చైత్రం!''

''ఏమిట్రా—''

''ఓరే భోషాణం - అందులోనే మాయిద్దర్లో ఒకడికి గుమాస్తా. ఒకడికి సూపర్వైజరూ నన్నా యిప్పించరా!''

---